
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
బుధవారం 31 జనవరి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.109	131	190
సూర్యాపేట	రూ.130	190	210
నల్లగొండ	రూ.129	187	213

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 । కనిష్ఠం 18.0

లక్ష్యం నెరవేరేనా?

- కొనసాగుతున్న పన్నుల వసూళ్లు
- రూ. 29.5 కోట్లకు రూ.12 కోట్లు వసూలు
- స్పెషల్ డ్రైవ్ చేపడుతున్న మునిసిపల్ అధికారులు
- మార్చి 31తో ఆఖరు

జిల్లాలో ఆస్తి పన్ను వసూలు ప్రక్రియ కొనసాగుతోంది. 2023-24 సంవత్సరానికి సంబంధించి మార్చి 31వ తేదీతో గడువు పూర్తి కానుండగా వసూళ్ల లక్ష్యం 40.67 శాతమే అయ్యింది. జిల్లాలోని ఐదు మునిసిపాలిటీలకు కలిపి రూ.29.5 కోట్లు లక్ష్యం బకాయిలు కాగా, ప్రస్తుతం రూ.12 కోట్లు మాత్రమే వసూలు చేశారు. గతేడాది సూర్యాపేట మునిసిపాలిటీలో 100 శాతం పన్నులు వసూలు చేశారు. మిగతా చోట్ల ఆశాజనకంగా కాలేదు. అయితే ఈ పర్యాయం అన్ని మునిసిపాలిటీల్లోనూ లక్ష్యాన్ని పూర్తి చేయాలని భావిస్తున్నారు.



సూర్యాపేట మునిసిపల్ కార్యాలయంలో పన్నుల వసూళ్లపై సిబ్బందితో సమీక్షిస్తున్న అధికారులు(ఫైల్)

● సూర్యాపేట టౌన్

సూర్యాపేట మునిసిపాలిటీ అధికారులు ఇంటి పన్నుల వసూళ్లను ముమ్మరం చేశారు. 22 మంది బిల్‌కలెక్టర్లు, నలుగురు సూపర్‌వైజర్లు పన్నుల వసూళ్లపై దృష్టి సారించారు. ఇంటి పన్నులతో పాటు వాణిజ్య సముదాయాలు, సెమీవాణిజ్య సముదాయాలకు పన్నులు చెల్లించాలని విస్తృత ప్రచారం చేపట్టారు. అధికారులు వాహనాల్లో తిరుగుతూ పన్నులు చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరిస్తున్నారు. అయితే గతానికి భిన్నంగా నవంబరు నెల నుంచే వసూళ్లు చేయడం ప్రారంభించారు. ఇందు కోసం ఇటీవలే ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశారు.

ఎర్లీబర్డ్ పథకంపై ప్రజల ఆసక్తి

ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగుస్తుంది. అయితే ఈలోపు చెల్లించే వారికి వడ్డీ ఉండదు. ఆ తర్వాత 2శాతం చొప్పున వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఎర్లీబర్డ్ పథకం ద్వారా ముందస్తుగా చెల్లించిన వారికి 5శాతం రాయితీ ఇస్తారు. దీంతో కొంతమంది ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది పన్నుల బకాయిలు అధికంగా ఉన్న వారికి రెడ్ నోటీసులు అందజేశారు. సూర్యాపేటలో 150 నుంచి 250 మందికి రెడ్ నోటీసులు అందజేశారు. దాదాపు రూ.50వేల నుంచి రూ.లక్ష దాకా పన్నులు చెల్లించని వారికి ఈ నోటీసులు జారీ చేస్తున్నారు. నోటీసులు అందుకున్న వారు మూడు రోజుల్లో పన్నులు చెల్లించకుంటే ఆస్తి జప్తు చేసే అధికారం మునిసిపాలిటీకి ఉంటుంది. అయితే గతంలోనే పన్నులు వసూలు చేయడంతో ప్రస్తుతం రెడ్‌నోటీసులు జారీ చేసే అంత బకాయి ఎవరికీ లేదు. ఇక జిల్లాలో సూర్యాపేటతో పాటు కోదాడ, హుజూర్‌నగర్ మునిసిపాలిటీలు ఉండగా కొత్తగా ఏర్పాటైన నేరేడుచర్ల, తిరుమలగిరి మునిసిపాలిటీలు ఉన్నాయి. ప్రస్తుతం సూర్యాపేట మునిసిపాలిటీలో రూ.16కోట్ల ఆస్తి బకాయిలు ఉండగా 56 శాతం మేర రూ.9 కోట్లు వసూలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మునిసిపాలిటీలకు కలిపి రూ.29.5కోట్లు ఉండగా ప్రస్తుతం రూ.12కోట్లకు పైగా వసూలు చేసినట్లు సమాచారం.

పన్నుల చెల్లింపునకు ప్రజలు సహకరించాలి



పన్నుల చెల్లింపునకు ప్రజలు సహకరించాలి. సకాలంలో పన్నులు చెల్లిస్తే అపరాధ రుసుం పడదు. పన్నులు చెల్లించకుంటే అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తుందని ప్రజలు గమనించాలి.

● రామానుజులరెడ్డి, మునిసిపల్ కమిషనర్, సూర్యాపేట

పన్నుల వసూళ్లలో వేగం పెంచాలి: అదనపు కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 30 : జిల్లాలో ఇంటి పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్పంచుల పదవీ కాలం ముగుస్తున్నందున పారదర్శకంగా అన్నిగ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారుల నియామకం జరుగుతుందన్నారు. ఇంటి పన్నులను నిర్దేశించిన గడువులోపు 100 శాతం పూర్తి చేయాలన్నారు. ఎక్కడా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సిబ్బందిని నియామకం చేపట్టవద్దని, జిల్లాలోని సిమెంట్ కంపెనీల నుంచి పన్నులను వసూలు చేయాలన్నారు. పంచాయతీల్లో 10శాతం బడ్జెట్‌ను గ్రీనరీకి ఖర్చు చేయాలన్నారు. అభివృద్ధి ప్రణాళికలను ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. 197 ప్రంచాయతీల్లో ఎఫ్‌టీవోల మేరకు చేపట్టిన మరుగుదొడ్లకు నిబంధనల మేరకు చెల్లింపులు చేయాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో సురేష్‌కుమార్, డీఆర్‌డీవో సుందరి కిరణ్‌కుమార్, డీపీవో యాదయ్య పాల్గొన్నారు.

మఠంపల్లికి అధికారుల బృందం

- నిధుల వినియోగంపై నేడు ఇంటింటి సర్వే
- అక్రమాలపై సర్పంచ్‌కు షోకాజ్ నోటీసులు
- షోకాజ్‌కు స్పందించకపోవడంతో రూ.74.84 లక్షల రికవరీకి ఆదేశం



ఈ నెల తేదీన మఠంపల్లి పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

మఠంపల్లి, జనవరి 30 : మఠంపల్లి సర్పంచ్ మన్నెం శ్రీనివా‌స్‌రెడ్డి అవినీతి, అక్రమాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసేందుకు నేడు అధికారుల బృందం రానుంది. ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల అమలు, నిధుల వినియోగంపై విచారణ చేయనున్నారు. కలెక్టర్ వెంకటరావు ఆదేశాల మేరకు ఐదుగురు ఎంపీడీవోలు, ఐదుగురు పీఆర్ ఏఈలతో విచారణ చేస్తుండటం గమనార్హం. ఇందుకు దారి తీసిన వివరాలు ఇలా ఉన్నాయి.

సర్పంచ్ మన్నెం శ్రీనివా‌స్‌రెడ్డి ప్రభుత్వ నిధుల వినియోగంలో అక్రమాలకు పాల్పడ్డారని వార్డు సభ్యులతో పాటు పలువురు గ్రామస్థులు ఈ నెల 4వ తేదీన కలెక్టర్‌తో పాటు హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 5వ తేదీన డీఎల్‌పీవో శ్రీరాములు, ఆర్డీవో పంచాయతీ రికార్డులను తీసుకుని వెళ్లారు. రికార్డుల పరిశీలనలో పలు నిధులు దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారణకు రావడంతో కలెక్టర్ వెంకటరావు ఈ నెల 14న కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డిని సస్పెండ్ చేసి, సర్పంచ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా ఈ నెల 23న సర్పంచ్ చెక్‌పవర్‌ను సైతం రద్దు చేశారు. అయితే షోకాజ్ నోటీసుకు సర్పంచ్ శ్రీనివా‌స్‌రెడ్డి సంజాయతీ ఇవ్వకపోవడంతో, దుర్వినియోగమైన నిధులు రూ.74,84,826 వసూలు చేయాలని ఈ నెల 27న తహసీల్దార్ మంగా రాథోడ్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆ మేరకు ఆయన ఈ నెల 29వ తేదీన కలెక్టర్ నోటీసును మరోసారి సర్పంచ్‌కు అందజేశారు.

గ్రామస్థుల ఫిర్యాదుతో..

మఠంపల్లి పంచాయతీకి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు, సీఆర్‌ఎస్, మినరల్ ఫండ్‌తో పాటు దాతలు ఇచ్చే నిధులు దుర్వినియోగం చేశారని గ్రామస్థులు పలువురు కలెక్టర్ వెంకటరావుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామంలో క్షేత్ర స్థాయిలో పర్యటించి నివేదిక అందించాలన్న కలెక్టర్ ఫిర్యాదు మేరకు అధికారుల బృందం బుధవారం మఠంపల్లిలో పర్యటించనుందని ఎంపీవో ఆంజనేయులు మంగళవారం తెలిపారు. అధికారుల పర్యటన ప్రజలు, నాయకుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

మాజీ ఎమ్మెల్యేకు సర్పంచ్ మేనమామ

మఠంపల్లి సర్పంచ్ శ్రీనివా‌స్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డికి మేనమామ. దీంతో అధికారుల చర్యలు, నోటీసులు రాజకీయంగా చర్చకు వస్తున్నాయి. మండలంలోని గుండ్లపల్లి సైదిరెడ్డి స్వగ్రామం కాగా మేనమామ స్వగ్రామం మఠంపల్లి. ఎమ్మెల్యేగా సైదిరెడ్డి హయంలో అనేక భూములను ఆక్రమించారన్న ఆరోపణలు, వైన్స్, ఇసుక, బియ్యం అక్రమరవాణా విషయాల్లో ఆయన జోక్యం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో మఠంపల్లి ఉండటంతో పలు అక్రమాల్లో ఆయన జోక్యం ఉందన్న ప్రచారం సాగుతోంది.

పారదర్శకంగా విచారణ కోసం..

మఠంపల్లి సర్పంచ్ శ్రీనివా‌స్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డికి మేనమామ కావడం, అతడి అక్రమాలపై విచారణను పారదర్శకంగా చేపట్టాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. న్యాయ, రాజకీయ విభాగాలకు అతీతంగా విచారణ అధికారులను ఏర్పాటు చేయడంతో పాటు పూర్తిస్థాయి అధ్యయనం తర్వాతే అధికారికంగా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. అందుకోసమే ఐదుగురు ఎంపీడీవోలు, ఐదుగురు పీఆర్ ఏఈలను బృందంగా ఏర్పాటు చేయించడంతో పాటు గ్రామంలో క్షేత్ర స్థాయిలో పర్యటించేలా సూచించినట్లు ప్రచారం సాగుతోంది. ఎక్కడా రాజకీయ విమర్శలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం.

పెదవీడు పంచాయతీలోనూ విచారణ

మండలంలోని పెదవీడు సర్పంచ్ సయ్యద్ బీబీకు తూబ్‌పై బీఆర్‌ఎస్ ఎంపీటీసీ, వార్డు సభ్యులు అదనపు కలెక్టర్‌కు ఈ నెల 27న ఫిర్యాదుచేశారు. సర్పంచ్, కార్యదర్శి లక్ష్మణ్‌లు 14, 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి సుమారు రూ.2 కోట్ల నిధులు దుర్వినియోగం చేశారని ఎంపీటీసీ కుందూరు వెంకటరెడ్డి మరికొందరు వార్డుసభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్ వెంకటరావు ఆదేశాల మేరకు వారం రోజుల్లోగా పూర్తిస్థాయి విచారణ జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎంపీడీవో మామిడిజానకిరాములకు తహసీల్దార్ మంగారాథోడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్థిక సంఘం నిధులతో పాటు సాగర్, నాగార్జున సిమెంట్ పరిశ్రమల మినరల్ ఫండ్, ఇతర పంచాయతీ నిధులపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



మౌనం పాటిస్తున్న అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, పోలీస్ అధికారులు

సూర్యాపేటక్రైం, జనవరి 30 : దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ప్రతీ ఒక్కరూ గాంధీ మార్గంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు జీ రవి, శ్రీనివాసరావు, ఏవో సురేష్‌బాబు, ఎస్‌బీఐలు రాజేష్, లక్ష్మీనారాయణ, ఆర్‌ఐ నారాయణరాజు, నర్సింహ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం



సమావేశానికి హాజరైన అధికారులు, డైరెక్టర్ల గైర్హాజరుతో ఖాళీగా ఉన్న కుర్చీలు

నేరేడుచర్ల, జనవరి 30 : మండలంలోని చిల్లేపల్లి సహకార సంఘం చైర్మన్ అనంతు శ్రీనివా‌స్‌గౌడ్‌పై మంగళవారం ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. చిల్లేపల్లి సహకార సంఘంలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా ఒక డైరెక్టర్ కొండ పిచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. వీరిలో 10 మంది సంఘం డైరెక్టర్లు చైర్మన్ శ్రీనివా‌స్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఈ నెల 8న జిల్లా సహకార సంఘం అధికారికి, కలెక్టర్ వెంకటరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 30న అవిశ్వాసం ఏర్పాటు చేస్తూ డైరక్టర్లకు నోటీసులు జారీ చేశారు. మంగళవారం జిల్లా అధికారి ఎన్.శ్రీధర్, అసిస్టెంట్ రిజిష్టార్ పద్మజ, రాజేశ్వరిలు 11 గంటలకు అవిశ్వాస తీర్మానాన్ని ఏర్పాటుచేశారు. సమావేశానికి 12 మంది డైరెక్టర్లు హాజరుకాలేదు. 11.30 వరకు వేచి చూసి అవిశ్వాసం సమావేశం రద్దు చేసి, అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించారు. ఏడాది వరకు అవిశ్వాసం ఏర్పాటు చేయడానికి అవకాశం ఉండదని తెలిపారు. అవిశ్వాస సమావేశం సందర్భంగా నేరేడుచర్ల, పాలకవీడు ఎస్‌ఐలు పరమేష్, లింగయ్యల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు.

అవినీతి ఆరోపణలపై కమిటీ ఏర్పాటు: జిల్లా సహకార సంఘం అధికారి శ్రీధర్

నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి పీఏసీఎస్‌లో అనంతు శ్రీనివాస్, సీఈవో నాగరాజు అక్రమాలకు పాల్పడ్డారని కొంత మంది డైరెక్టర్లు, రైతులు కలెక్టర్ వెంకటరావుకు ఫిర్యాదు చేశారని, ఆ ఫిర్యాదుపై విచారణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు జిల్లా సహకార సంఘం అధికారి శ్రీధర్ తెలిపారు. మంగళవారం చిల్లేపల్లి పీఏసీఎస్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. చిల్లేపల్లి సహకార సంఘం నుంచి 2020-21లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన విషయంలో చైర్మన్, సీఈవోలు రైస్‌మిల్లర్లతో కుమ్మక్కై ఇక్కడి రైతులతో సంబంధం లేకుండా మరొక చోట నుంచి ధాన్యం తీసుకువచ్చి ఇక్కడి రైతుల పేర్లతో విక్రయించారని ఆరోపణలు వచ్చినట్లు తెలిపారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఐదుగురు సభ్యులతో కమిటీ వేస్తున్నట్లు తెలిపారు. కమిటీలో అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి(రెవెన్యూ) నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కలిసి ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కమిటీలో స్థానిక తహసీల్దార్, ఏవో, ఏఈవో, ఆర్‌ఐ, హుజూర్‌నగర్ కోపరేటివ్ అసిస్టెంట్ రిజిస్టర్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కమిటీ మూడు రోజుల్లో పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు అందజేయనుందని ఆయన తెలిపారు.

అధికార బలంతో ఆక్రమించారు

- స్థలాన్ని తిరిగి అప్పగించాలి: బాధితులు
- కోదాడ మాజీ ఎంపీపీ ఇంటి ముందు బాధితుల ఆందోళన
- ఆ భూమిని విక్రయించారు : మాజీ ఎంపీపీ కవిత





మాజీ ఎంపీపీ కవిత గెస్ట్‌హౌస్ ముందు ఆందోళన చేస్తున్న బాధితులు, అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కోదాడ రూరల్, జనవరి 30 : అధికార బలంతో తమ స్థలం ఆక్రమించి ఇల్లు నిర్మించుకుందని, ఆ స్థలాన్ని తమకు అప్పగించాలని కోదాడ బీఆర్‌ఎస్ నాయకురాలు, మాజీ ఎంపీపీ చింతా కవిత ఇంటి ముందు బాధితులు ఆందోళన చేశారు. తమ పూర్వీకులకు ఇనాంగా వచ్చిన భూమిని బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారం చెలాయించి బలవంతంగా ఆక్రమించుకుందని ఆరోపించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకూ ఆ ఇంటిలోకి ఎవరూ వెళ్లకుండా చూడాలన్న ఎమ్మెల్యే పద్మావతి ఆదేశాల మేరకు ఆర్డీవో సీజ్ చేసి ఇరువర్గాల వారికి నోటీసులు జారీ చేశారు. బాధితుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గుడిబండ గ్రామంలోని సర్వే నెంబరు 152/1లో 7 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని జమీందారుల కాలంలో మంగలి వృత్తి చేసుకుంటూ జీవిస్తున్న మాధవరపు లక్ష్మయ్యకు ఇనాంగా ఇచ్చారు. ప్రస్తుతం ఆయన వారసులు మాధవరపు వెంకటయ్య, మాధవరపు ముత్తయ్య, గురవయ్య, సీతారాములు, గోపాల్, వెంకటేశ్వర్లు అక్కడే ఉంటున్నారు. ఇదిలా ఉండగా లక్ష్మయ్య భూమి పక్కనే కోదాడ మాజీ ఎంపీపీ చింతా కవితకు కొంతభూమి ఉంది. ఏడాది కిందట లక్ష్మయ్య వారసులను పిలిపించి భూమి ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉందని, మా భూమితో పాటు మీ భూమికి కూడా ఫెన్సింగ్ వేయిస్తానంటూ చెప్పటంతో వారు అంగీకరించారు. ఆ తర్వాత ఆ భూమి తమదేనంటూ చెబుతుండటంతో వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎంపీపీ కవిత నిర్బంధంగా భూమిని స్వాధీనం చేసుకుని చుట్టూ ప్రహరీ నిర్మించడంతో పాటు ఏడాది కిందట గెస్ట్‌హౌస్ కూడా నిర్మించింది. నిర్మాణ సమయం నుంచి లక్ష్మయ్య వారసులు ఆ భూమి కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు.

అధికారం కోల్పోవడంతో..

బీఆర్‌ఎస్ అధికారం కోల్పోవడంతో పాటు ఎంపీపీ కవితపై సభ్యులు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వడంతో ఆమె తన పదవికి రాజీనామా చేసింది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉండటంతో తమకు న్యాయం జరుగుతుందని భావించిన లక్ష్మయ్య వారసులు ఎమ్మెల్యే పద్మావతితో పాటు అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా మంగళవారం ఉదయం ఆరు గంటల సమయంలో కవిత నిర్మించిన గెస్ట్‌హౌస్ వద్దకు వెళ్లి టెంట్ వేసుకుని ఆందోళన ప్రారంభించారు. ఆక్రమించిన తమ భూమిని తిరిగి ఇవ్వాలంటూ ఆందోళన చేశారు. టెంట్‌ను తీసివేసేందుకు ఎంపీపీ కవిత, ఆమె అనుచరులు ప్రయత్నించగా తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో అక్రమంగా తన ఇల్లును ఆక్రమించారని కవిత డీఎస్పీ, సీఐ రామకృష్ణారెడ్డికి ఫిర్యాదుచేసింది. 8 గంటల ప్రాంతంలో రంగంలోకి దిగిన పోలీసులు అక్కడ వేసిన టెంటును తొలగించి ఆందోళనకారులతో మాట్లాడారు. ఒకదశలో లక్ష్మయ్య వారసులు క్రిమిసంహారక మందు తాగడానికి ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకుని, వారందరినీ బలవంతంగా ఒంటి గంట సమయంలో కోదాడ రూరల్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ తతంగమంతా ఉదయం 7 గంటల నుంచి ఒంటి గంట వరకు సాగింది. పోలీసులతో చర్చించిన లక్ష్మయ్య వారసులు మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో అక్కడి నుంచి గ్రామానికి చేరుకున్నారు.

కోర్టుల చుట్టూ తిప్పింది: లక్ష్మయ్య వారసులు

నమ్మించి తమ భూమిలో ఇల్లు కట్టుకుందని లక్ష్మయ్య వారసులు ఆరోపించారు. నిర్మాణ సమయంలో అడ్డుతగిలితే అధికారాన్ని అడ్డుపెట్టి అక్రమ కేసులు నమోదు చేయించి, కోర్టుల చుట్టూ తిప్పిందని వాపోయారు. పోలీస్‌స్టేషన్‌లో కూడా తమను నాలుగు రోజుల పాటు నిర్బంధించిందని వారన్నారు. అధికారంలో ఉండటంతో కవిత ఇష్టారాజ్యంగా వ్యవహరించి, తమ భూమిని స్వాధీనం చేసుకుందన్నారు.

ఆ భూమిని విక్రమించారు : కవిత, మాజీ ఎంపీపీ

మాధవరపు లక్ష్మయ్య వారసులు వారి భూమిని విక్రయించారని మాజీ ఎంపీపీ కవిత అన్నారు. కొనుగోలు చేసిన తర్వాతే అక్కడ నిర్మాణం చేపట్టామన్నారు. లక్ష్మయ్య వారసుల ఆరోపణలు నిజం కాదన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా..

గుడిబండ గ్రామంలో సీసీ రోడ్డు ప్రారంభించడానికి ఎమ్మెల్యే పద్మావతి గ్రామానికి వచ్చారు. దీంతో లక్ష్మయ్య వారసులు తమ భూమిని మాజీ ఎంపీపీ కవిత ఆక్రమించిందని, ఆందోళన చేసిన విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ సాయికుమార్‌గౌడ్‌ల స్థలాన్ని పరిశీలించి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో కవితతో పాటు లక్ష్మయ్య వారసులకు నోటీసులు జారీ చేసి ఇంటిని సీజ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే ఎవరూ ఆ భూమిలోకి వెళ్లవద్దని నోటీసులు ఇచ్చి, ధిక్కరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రెవెన్యూ అధికారుల నోటీసులపై సంతకాలు చేస్తున్న కవిత

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు

పకడ్బందీ ఏర్పాట్లు

భానుపురి, జనవరి 30 : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఐఈవో కృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభమయ్యే పరీక్షల కోసం జిల్లాలో 42 కేంద్రాల్లో జనరల్, 13 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. పరీక్షల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. 22 ప్రైవేట్ కళాశాలలు, 20 ప్రభుత్వ కేంద్రాల్లో ఫిబ్రవరి 1 నుంచి 18వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. ప్రతీ కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. జనరల్‌లో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు 5,100 మంది, ఒకేషనల్ విభాగంలో 2,800 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు వివరించారు. విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్షల్లో మంచి ఫలితాలు వచ్చేలా తమ ప్రతిభను కనబరచాలని సూచించారు.

నేడు సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల

- 11.8 అడుగులకు చేరిన పాలేరు జలాశయం
- తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పాలేరు జలాశయం నింపాలని ప్రభుత్వం నిర్ణయం
- ఖమ్మం జిల్లా ప్రజల దాహార్తిని తీర్చడానికే నీటి విడుదల

నాగార్జునసాగర్, జనవరి 30: ఖమ్మం జిల్లాప్రజల దాహార్తిని తీర్చేందుకు పాలేరు జలాశయానికి నీటిని విడుదల చేయనున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎడమకాల్వకు బుధవారం ఉదయం 10 గంటలకు నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. పాలేరు జలాశయంలో నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖమ్మం జిల్లా ప్రజల దాహార్తిని తీర్చడానికి నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పాలేరు జలాశయం నింపేందుకు ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయాలని కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి ఎడమకాల్వ ద్వారా రోజుకు ఐదు వేల క్యూసెక్కుల చొప్పున 10 రోజుల పాటు 5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఆదేశించినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. పాలేరు జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 22.5 అడుగుల కాగా ప్రస్తుతం 11.8 అడుగులుగా ఉంది. దీంతో ఖమ్మం పట్టణానికి తాగునీటి సరఫరా కష్టమవుతుంది. ఈ మేరకు పాలేరు జలాశయాన్ని నింపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కేఆర్‌ఎంబీ సభ్యుల పర్యవేక్షణలో నీటి విడుదల చేయనున్నట్లు తెలిపారు. నీరు వృథా కాకుండా ఉండేందుకు ఎడమకాల్వ పరిధిలోని మేజర్లు, మైనర్లు, తూముల, షట్టర్ల వద్ద సిబ్బందిని కాపలా ఉంచాలని అధికారులు నిర్ణయించారు. ఇదిలా ఉండగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 520.10 అడుగులు (149.4580 టీఎంసీలు)గా నమోదైంది. సాగర్ నుంచి జంట నగరాల తాగునీటి అవసరాల నిమిత్తం ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 900 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువ నుంచి ఎలాంటి నీటి రాక లేదు. సాగర్ కుడి, ఎడమ, వరద కాల్వలకు ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ఎలాంటి నీటి విడుదల లేదు.

నల్లగొండను ఎండబెడతారా..? : జూలకంటి
ఫిబ్రవరి 2న సాగర్ సీఈ కార్యాలయం వద్ద ధర్నా 7

యాదాద్రిలో క్షేత్రపాలకుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట, జనవరి 30: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనృసింహుడికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామిని అర్చక స్వాములు వేదమంత్రాలతో పంచామృతాభిషేకం చేసి సింధూరం, వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. ఆంజనేయుడి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, అష్టభుజి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్యతిరుకల్యాణం ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు సంప్రదాయరీతిలో కొనసాగాయి.

కొండపైన అనుబంధ ఆలయమైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి, ముఖమండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. అనుబంధ పాతగుట్ట ఆలయంలో పుష్కరిణి, ప్రధానాలయంలోని, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.20,09,970 ఆదాయం సమకూరిందని దేవస్థాన అధికారులు తెలిపారు.



తిరువీధుల్లో లక్ష్మీనృసింహుల అలంకార జోడు సేవలను ఊరేగిస్తున్న అర్చకులు



మోత్కూరులో గోదాం వద్ద క్యూలో ఉంచిన సిలిండర్లు, ఎదురు చూస్తున్న వినియోగదారులు

వంట గ్యాస్ కోసం తిప్పలు

మోత్కూరు జనవరి 30: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు, ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు, తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు. మోత్కూరు భారత్ గ్యాస్ గోదాంకు సిలిండర్ల లోడ్ వస్తుందని తెలియడంతో వినియోగదారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులుకాశారు. లోడ్ లారీ(524 సిలిండర్లు) రాగానే సిలిండర్లను గోదాంలో దించకుండా, డోర్ డెలివరీ వాహనాల్లో లోడ్ చేయకుండా అడ్డుకుని లారీ నుంచే నేరుగా సిలిండర్లు తీసుకున్నారు. ఉదయం నుంచి క్యూలో నిల్చున్నా చివరన ఉన్న వారికి సిలిండర్లు అందక ఖాళీ సిలిండర్ తీసుకొని వెళ్లిపోయారు.



కాపర్‌వైర్ చోరీ ముఠా అరెస్టు

మిర్యాలగూడ అర్బన్, జనవరి 30: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైరును కాజేసే దొంగల ముఠాను నల్లగొండజిల్లా మిర్యాలగూడ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటగిరి కేసు వివరాలు వెల్లడించారు. నిడమనూరు మండలం ముప్పారం గ్రామానికి చెందిన కుంచం కోటేష్, రూపాని గోపి, కూసాని నాగయ్య, వరికుప్పల శ్రీను, వరుసు నాగరాజు, కుంచం విజయ్ ముఠాగా ఏర్పడి డివిజన్‌లోని ఏడు చోరీలకు పాల్పడ్డారు. ఇప్పటివరకు మిర్యాలగూడ, వేములపల్లి, త్రిపురారం, నేలకొండపల్లితో కలిపి మొత్తం ఏడు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి దొంగిలించిన కాపర్‌వైర్‌ను వెంటనే విక్రయిస్తే పట్టుబడుతామన్న భయంతో రహస్యంగా దాచిపెట్టారు. అందులో కొంత వైరును మిర్యాలగూడ పట్టణంలో విక్రయించేందుకు నిందితులు రెండు ద్విచక్రవాహనాలపై వస్తూ వాహన తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డారు. అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను అంగీకరించారు. వారి నుంచి రూ.3లక్షల విలువైన 305కిలోల కాపర్‌వైర్, మూడు ద్విచక్రవాహనాలు, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. దొంగల ముఠా గుట్టురట్టు చేసేందుకు డీఎస్పీ ఆధ్వర్యంలో పనిచేసిన బృందంలోని టూటౌన్ సీఐ నర్సింహారావు, ఎస్ఐలు కృష్ణయ్య, రాంబాబు, విజయ్‌కుమార్, వీరశేఖర్, హెచ్‌సీ వెంకటేశ్వర్లు, పీసీలు రవి, నరేష్‌కుమార్, అక్బర్, రామకృష్ణలను ఎస్పీ చందనదీప్తి అభినందించారు.

సందీప్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి క్షమాపణ చెప్పాలి


హైదరాబాద్‌లో డీజీపీకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దేవరకొండ, జనవరి 30: యాదాద్రిభువనగిరి జడ్పీ ఛైర్మన్ సందీప్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా దేవరకొండలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీపై అడిగితే ఓపికతో సమాధానం చెప్పాల్సిన మంత్రి సహనం కోల్పోయి మాట్లాడడం సరికాదన్నారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ హామీలు అమలు చేయాలని అడిగిన ప్రతిపక్ష పార్టీలతో మాట్లాడే వ్యవహారశైలి సరికాదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు టీవీఎన్ రెడ్డి, హనుమంతు వెంకటేష్‌గౌడ్, సుభాష్, గాజుల ఆంజనేయులు, రాజేష్, అనంతగిరి, ప్రతాప్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, మల్లారెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

సూర్యాపేట(కలెక్టరేట్): మంత్రి వెంకట్‌రెడ్డి వీధి రౌడీలా ప్రవర్తిస్తూ బీఆర్ఎస్ నాయకులను అవమానించి, దాడులకు ఉసిగొల్పుతున్నారని బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నించినందుకు భువనగిరి జడ్పీ ఛైర్మన్ సందీప్‌రెడ్డిపై దాడి చేయించడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసులతో ఏకమై గూండాయిజం చేయడం తగద న్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే దాడి చేస్తారా అని జడ్పీ ఛైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, నెమ్మాది భిక్షం, ఉప్పల ఆనంద్, కోడి సైదులుయాదవ్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్: జడ్పీ ఛైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జడ్పీచైర్మన్‌ను అవమానించే విధంగా మంత్రి మాట్లాడడం తగదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు డిల్లీ మాధవరెడ్డి, ముప్పిడి శ్రీనివాస్, బొడిగే ఆనంద్, మల్లేశ్ పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: యాదాద్రి జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాకేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్‌లపై మాట్లాడే నైతిక హక్కు మంత్రి కోమటిరెడ్డికి లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నాయకులు నోముల శంకర్‌యాదవ్, బాషబోయిన లింగస్వామి, క్రాంతి కుమార్, గంట కిరణ్, గణేష్, శ్రీకాంత్, నానియాదవ్, శివకుమార్, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: ప్రభుత్వ కార్యక్రమంలో జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిపై జరిగిన దాడి ఘటనలో పక్షపాత ధోరణితో వ్యవహరించిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీజీపీ రవిగుప్తాకు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధుల బృందం మంగళవారం హైదరాబాద్‌లో ఫిర్యాదు చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరులో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ప్రసంగంపై ప్రశ్నిస్తున్న జడ్పీచైర్మన్‌పై స్థానిక పోలీస్ అధికారులు దురుసుగా వ్యవహరించడం సరికాదన్నారు. విచారణ చేపట్టి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, జడ్పీ ఛైర్మన్లు ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బండా నరేందర్‌రెడ్డి గుజ్జ దీపిక, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లబోతు భాస్కర్‌రావు శానంపూడి సైదిరెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి ఉన్నారు. అహంకార పూరితంగా వ్యవహరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని యాదాద్రిభువనగిరి జడ్పీ వైస్‌ఛైర్మన్ ధనావత్ భీకూనాయక్ డిమాండ్ చేశారు. జడ్పీ కార్యాలయంలో భువనగిరి, యాదగిరిగుట్ట, రాజాపేట జడ్పీటీసీలు సుబ్బూరు బీరు మల్లయ్య, తోటకూరి అనురాధ, చామకూర గోపాల్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడువక ముందే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దురుసుగా వ్యవహరించడం సరికాదన్నారు. మంత్రికి సమాన హోదా కలిగిన జడ్పీ చైర్మన్‌ను అవమాన పర్చడం సరికాదన్నారు.

బొమ్మలరామారం: మంత్రి వెంకట్‌రెడ్డి జడ్పీ ఛైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిని కించపరిచే వాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల నాయకులు అన్నారు. జడ్పీచైర్మన్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండలకేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సందీప్‌రెడ్డి ఎదుగుదలను చూసి ఓర్వలేక అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోలగోని వెంకటేష్‌గౌడ్, ఎంపీపీ సుధీర్‌రెడ్డి, గూదె బాలనర్సింహ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దూషించడం సరికాదని ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. భూదాన్‌పోచంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. అహంకార పూరితంగా వ్యవహరిస్తే ప్రజలే తిరగబడతారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాటి సుధాకర్‌రెడ్డి, సీత వెంకటేశం, కోట మల్లారెడ్డి, కందాడి భూపాల్‌రెడ్డి, బత్తుల మాధవి శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డిని విమర్శించడం తగదు : బీర్ల


బొమ్మలరామారంలో సందీప్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తుర్కపల్లి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై మాజీమంత్రి జగదీష్ రెడ్డి, జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన నాయకుడిని ఇష్టారాజ్యంగా విమర్శించడం సిగ్గుచేటని, మాజీమంత్రికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

మంత్రి కోమటిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

బొమ్మలరామారం: జడ్పీ చైర్మన్‌గా ఉంటూ సొంత గ్రామానికి రోడ్డు కూడా వేయలేని సందీప్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. మండల కేంద్రంలో జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. సొంత గ్రామం వడపర్తి నుంచి చీకటిమామిడి వరకు డబుల్ రోడ్డు వేస్తానని హామీ ఇచ్చి నెర వేర్చలేని సందీప్‌రెడ్డి మంత్రిపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు మర్రి భగవంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, దేశెట్టి చంద్రశేఖర్, రఘు, బాసరమ్ బాబు, కుమార్, మహేష్‌గౌడ్, యాదయ్య, హేమంత్‌రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

ఆరుగురిని బలితీసుకున్న లారీ సీజ్

మిర్యాలగూడ అర్బన్, జనవరి 30: రెండు కుంటుంబాలకు చెందిన ఆరుగురిని బలిదీసుకున్న లారీని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు మంగళవారం సీజ్‌చేసి డ్రైవర్‌ను అరెస్టుచేశారు. ఈ నెల 28వ తేదీ అర్ధరాత్రి అద్దంకి- నార్కట్‌పల్లిరోడ్డుపై మిర్యాలగూడ వద్ద కారును ఏపీ రాష్టం వైపు వెళ్తున్న పొట్టులారీ ఢీ కొట్టిన సంఘటనలో ఆరుగురు మృతిచెందిన సంఘటన విదితమే. ప్రమాదం జరిగిన తరువాత పోలీసులకు చిక్కకుండా లారీని డ్రైవర్ ఏపీ రాష్ట్రంలోకి ప్రవేశించాడు. దీంతో ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించేందుకు సీసీకెమెరాల పుటేజీలు కీలకంగా మారాయి, పుటేజీల ఆధారంగా పరారీలో ఉన్న లారీని అద్దంకి వద్ద సోమవారం అదుపులోకి తీసుకున్న పోలీసులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కేసునమోదు చేశారు. కాగా పోలీసులు సీజ్ చేసినలారీని డీఎస్పీ వెంకటగిరి పరిశీలించారు. లారీ ముందు భాగంలో దళసరి ఐరన్‌బంపర్ కారును ఈడ్చుకెళ్లడంతో ప్రమాద తీవ్రత పెరిగినట్లు నిర్ధారించారు. లారీని వెంబడించి పట్టుకున్న ఎస్ఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీస్ బృందాన్ని ఆయన అభినందించారు.


పొగమంచుకు లైట్ల వెలుతురులో వెలుతున్న వాహనాలు


రహదారి పక్కన దట్టమైన పొగమంచు కారణంగా కనిపించని చెట్లు

కప్పేసిన మంచుదుప్పటి

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ శివారులో జాతీయ రహదారిని మంగళవారం మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం 9గంటల సమయంలోనూ జాతీయ రహదారిపై దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో లైట్ల వెలుతురులో నెమ్మదిగా ముందుకు సాగారు. కొందరు వాహనాలను రోడ్డు పక్కకు ఆపి పొగమంచు తగ్గాక బయలుదేరారు. ఉదయపు నడకకు వెళ్లేవారు సైతం మంచు తగ్గుముఖం పట్టాక బయటకు వచ్చారు. కనువిందు చేసిన మంచు దృశ్యాలను ప్రకృతి ప్రేమికులు తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

● చిట్యాలరూరల్.

నల్లగొండను ఎండబెడతారా..? : జూలకంటి

మిర్యాలగూడ, జనవరి 30: ఇతర జిల్లాలకు సాగర్ నీరు వీడుదల చేసి నల్లగొండను ఎండబెడతారా అని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు తాగునీరు, ఖమ్మం జిల్లా పాలేరుకు ఎడమకాల్వ ద్వారా నీరు విడుదల చేసేందుకు చర్యలు చేపడుతూ ప్రాజెక్టు ఉన్న నల్లగొండ జిల్లాను ఎండబెట్టడం సరికాదన్నారు. నల్లగొండ జిల్లా ప్రజలకు సాగునీటి, తాగునీటి ఎద్దడి రాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా మంత్రులపై ఉందన్నారు. ఎస్ఎల్‌బీసీ కింద నల్లగొండ, నకిరేకల్ ఎడమకాల్వకింద నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లోని వారికి ప్రయోజనం కలుగుతుందన్నారు. రైతులు బోరుబావుల కింద సాగుచేసిన వరి పొలాలు పొట్టదశలో నీరు లేక ఎండిపోతున్నాయన్నారు. పంటను రక్షించుకోకుంటే రైస్‌మిల్లులు మూతపడే ప్రమాదం ఉందన్నారు. బియ్యం ధరలు పెరిగి సామాన్యులకు భారంగా మారుతోందన్నారు. గతంలో సాగర్ నీటిమట్టం 505అడుగులు ఉన్నప్పుడు కూడా ఎడమకాల్వకు నీరు విడుదల చేసి చెరువులు కుంటలు నింపిన సంఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుతం 520అడుగులు ప్రాజెక్టులో నీరు ఉన్నందున పది రోజులపాటు సాగర్ ఎడమకాల్వకు, ఎస్ఎల్‌బీసీ, వరదకాల్వలకు నీరు విడుదల చేసి చెరువులను, కుంటలను నీటితో నింపాలన్నారు. పలు చోట్ల మిషన్‌భగీరథ నీరందక ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడుతుందన్నారు. ఎడమకాల్వ ద్వారా చెరువులను నింపితే భూగర్భ


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

జలాలు పెరిగి బోరుబావుల కింద సాగు చేసిన పొలాలను రక్షించవచ్చునని అన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను కలిసి చర్చించినట్లు తెలిపారు. ఎడమకాల్వపై నున్న మేజర్, మైనర్ కాల్వల తూముల వద్ద అధికారులను కాపలాఉంచి ఖమ్మం జిల్లా పాలేరుకు తరలిస్తామనడం సరికాదన్నారు. నల్లగొండ జిల్లాలోని చెరువులను సాగర్ నీటిద్వారా నింపేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న సాగర్‌లోని ప్రాజెక్టు సీఈ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు జిల్లా వ్యాప్తంగా రైతులు కదిలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, తిరుపతి రాంమూర్తి, జగదీశ్‌చంద్ర, రాగిరెడ్డి మంగారెడ్డి, భావాండ్ల పాండు, వినోద్ నాయక్, పరుశరాములు, పగిడోజు రాంమూర్తి, పాపానాయక్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

చిట్యాలరూరల్, నార్కట్‌పల్లి, జనవరి 30: నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామానికి చెందిన కిన్నెర బక్కయ్య, పూలమ్మ దంపతుల కుమారుడు కిన్నెర మధు(35) మరొకరితో కలిసి ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు బైక్‌పై వెళుతున్నారు. పెద్దకాపర్తి శివారులో 7మిడ్‌వే హోటల్ ఎదురుగా ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. దీంతో మధుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బద్రికి తీవ్ర గాయాలు కాగా ఆంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చిట్యాల ఎస్ఐ సైదాబాబు తెలిపారు. కనగల్ మండలం పగిడిమర్రి గ్రామానికి చెందిన ఇటివాల శ్రీను, భార్య కళమ్మ(37) ఈ నెల 29న చెర్వుగట్టుకు వచ్చి శ్రీపార్వతీదేవి ఆలయ ఆవరణ సమీపంలో నిద్రించారు. హైదరాబాద్‌కు చెందిన ఏపీ 29వి9122 నంబరుగల ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును డ్రైవర్ అబ్దుల్ అజాగ్రత్తగా నడిపి నిద్రిస్తున్న కళమ్మ పైనుంచి వెళ్లడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందింది. కళమ్మ భర్త శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నార్కట్‌పల్లి ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

ఆశ కార్యకర్త ఆత్మాహత్యాయత్నం

నిడమనూరు, జనవరి 30: కాంగ్రెస్ పార్టీ నాయకుడు తనను వేధిస్తున్నాడని ఆరోపిస్తూ ఆశ కార్యకర్త ఎమ్మెల్యే సమక్షంలో ఆత్మాహత్యాయత్నం చేసింది. మంగళవారం నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని పార్వతీపురంలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం గ్రామస్థులు ఇటీవల విషజ్వరాల బారిన పడడంతో గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మంగళవారం గ్రామంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అధికారులు, వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. అదే సమ యంలో గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త సంకూరి వెంకటలక్ష్మి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంకతి సత్యం తనను వేధిస్తున్నాడని ఆరోపిస్తూ సమావేశంలోనే బ్లేడుతో ఎడమ చేతి ముంజేయి భాగంలో కోసుకుంది. ఈ చర్యతో ఒక్కసారిగా సమీక్షలో అలజడి రేగింది. వైద్య సిబ్బంది వెంటనే ఆమెకు చికిత్స చేసి ఇంటికి పంపారు. త్రిపురారంలో సమావేశం ఉండ డంతో ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆశ కార్యకర్త నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆత్మాహత్యాయత్నానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు తనను ఇబ్బందులు పెడుతూ, తనపై తరచూ అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నందుకే ఆత్మాహత్యాయత్నం చేసినట్లు ఆమె ఆరోపించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నేత అంకతి సత్యం వివరణ ఇస్తూ ఆశ కార్యకర్తను తాను ఎప్పుడూ ఇబ్బందులు పెట్టలేదని, గ్రామంలో విషజ్వరాలు ఉన్నందున నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించానని చెప్పారు. ఆశ కార్యకర్త చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు.


ఆశ కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

గాంధీ మార్గంలో నడవాలి


కోదాడలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సూర్యాపేట టౌన్, జనవరి 30: జాతిపిత మహాత్మాగాంధీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేటలోని పార్కులో గాంధీ మ్యూజియం, ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మాశెట్టి అనంతరాములు, మీలా వాసుదేవ్, మీలా వంశీ, గుండా శ్రీదేవి, అంజద్‌అలీ, బండారు రాజా, కేశవులు పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, కౌన్సిలర్లు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


హుజూర్‌నగర్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

● సూర్యాపేటలో గాంధీ విగ్రహానికి ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇందారపు రాజమల్లయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తక్కెలపల్లి ప్రశాంత్, మిద్దె బాబురావు, రింగు ఐసయ్య పాల్గొన్నారు.

కోదాడ టౌన్: కోదాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పారా సీతయ్య, జాని, ఎర్నేని బాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలో గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఓరుగంటి నర్సింహారావు, పొలిశెట్టి నర్సింహారావు, కౌన్సిలర్ ఓరుగంటి నాగేశ్వరరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో రమేష్, రామారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మఠంపల్లి: మండలం కేంద్రంతో పాటు గ్రామాల్లో గాంధీ చిత్రపటాలు, విగ్రహాలకు పలువురు నివాళులర్పించారు.

నేరేడుచర్ల: పట్టణంలోని జడ్పీహెచ్ఎస్‌లో గాంధీ విగ్రహానికి వాసవి, వనితా, లయన్స్ క్లబ్ సభ్యులు, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ అశోక్‌రెడ్డి, క్లబ్ సభ్యులు రాచకొండ శ్రీనివాసరావు, నటరాజు పాల్గొన్నారు.

పాలకవీడు: మండల కేంద్రంలోని పాలకవీడులోని గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు యాదా ఈశ్వరయ్య పూలమాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో రాధాధనుంజయ, శేఖర్ పాల్గొన్నారు.

నడిగూడెం: మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ గుండు శ్రీను, మాజీ సర్పంచులు చిల్లంచర్ల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.


సూర్యాపేటలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

మునగాల: మండల కేంద్రంలోని గాంధీ పార్కులో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో వంగవీటి వెంకటగురుమూర్తి, కాపర్తి మణికంఠకుమార్; వీవీడీ ప్రసాద్, , వాసా శ్రీనివాసరావు, మంగేష్, కిషోర్ పాల్గొన్నారు.

తుంగతుర్తి: ఆర్యవైశ్య సంఘం నాయకులు ఓరుగంటి సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాటికొండ సీతయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.


తంగతుర్తిలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్య వైశ్య సంఘం నాయకులు

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐలు


సత్యనారాయణ


బాలునాయక్

తిరుమలగిరి, సూర్యాపేట రూరల్, జనవరి 30: తిరుమలగిరి ఎస్‌ఐగా కె.సత్యనారాయణ, సూర్యాపేట రూరల్ ఎస్‌ఐగా ఎన్.బాలునాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుమలగి ఎస్‌ఐగా పనిచేసిన ప్రసాద్ వీఆర్‌కు అటాచ్ కాగా, నల్లొండ డీఎస్పీలో విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ బదిలీపై తిరుమలగిరికి వచ్చారు. సూర్యాపేట రూరల్ ఎస్‌ఐగా పనిచేసిన ఆర్.సాయిరాం బదిలీపై జిల్లా ఎస్పీకి వెళ్లారు. వీఆర్‌లో ఉన్న బాలునాయక్ బదిలీపై సూర్యాపేట రూరల్‌కు వచ్చారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్, జనవరి 30: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. దేశాన్ని మత ప్రాతిపదికన చీల్చి బీజేపీ మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తుందన్నారు. నూతన కార్మిక చట్టాలను రద్దుచేయాలన్నారు. దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శీలం శ్రీను, వాసు, వెంకటనారాయణ, లక్ష్మి, సైదులు, అనంతప్రకాశ్, రామ్మూర్తి, కృష్ణ, స్వరాజ్యం, సోమయ్య వెంకన్న పాల్గొన్నారు.

పేటలో పట్టపగలు భారీ చోరీ

రూ.20 లక్షల విలువైన 30తులాల బంగారు ఆభరణాల అపహరణ

సూర్యాపేట క్రైం, జనవరి 30: జిల్లా కేంద్రంలో పట్టపగలు భారీ చోరీ జరిగింది. రూ.20 లక్షల విలువైన ఆభరణాలు చోరీకి గురయ్యాయి. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం. సూర్యాపేట పట్టణంలోని ప్రియాంకకాలనీలో నివసిస్తున్న రాగి పూర్ణశేఖర్ బంగారు ఆభరణాలు తయారుచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య పట్టణంలోనే ఉంటున్న తల్లిగారింటికి వెళ్లింది. పూర్ణశేఖర్ రోజు మాదిరిగా ఉదయం సమయంలో ఇంటికి తాళం వేసి దుకాణానికి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చి భోజనం చేసి దుకాణానికి వెళ్లాడు. రాత్రి సమయంలో దుకాణం బంద్ చేసుకుని అత్తగారింట్లో ఉన్న భార్య, కుమారుడిని తీసుకుని ఇంటికి వచ్చాడు. అప్పటికే ఇంటి తాళాలు ధ్వంసం చేసి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా లాకర్‌లో భద్రపరిచిన రూ.20లక్షల విలువైన 30 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పూర్ణశేఖర్ కదలికలపై నిఘా పెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు భోజనానికి ఇంటికి వచ్చిన వెళ్లిన తర్వాత చోరీకి పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై బాధితుడు పూర్ణశేఖర్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

చివ్వెంల, జనవరి 30: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం దురాజ్‌పల్లి గ్రామ ఆవాసం వస్త్రంతండావద్ద జాతీయ రహదారి 65పై చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దురాజ్‌పల్లి ఆవాసం రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన వల్లపు వెంకటమ్మ వస్త్రంతండా వద్ద ఉన్న హెచ్‌పీ బంక్ సమీపంలో రోడ్డు దాటుతుండగా.. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపునకు వేగంగా వెళుతున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటమ్మతో పాటు బైకు నడుపుతున్న గుంజలూరు గ్రామానికి తండా లోకేష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిద్దరిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. వెంకటమ్మ అల్లుడు చల్లా ఏడుకొండలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

54క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

నాగారం, జనవరి 30: మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో వడ్డే లక్ష్మయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 20క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని, ఈటూరు గ్రామంలో గుండు యాదగిరి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 34 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసిన లక్ష్మయ్య, యాదగిరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకటరాములు తెలిపారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

గరిడేపల్లి, జనవరి 30: మండలంలోని గడ్డిపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులను మంగళవారం జారీ చేశామని ఎంఈవో ఛత్రునాయక్ తెలిపారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఐతరాజు సుధాకర్ కాలేజీ విద్యార్థినులతో అనుచితంగా ప్రవర్తించిన ఘటనపై ఆయనను సస్పెండ్ చేస్తూ డీఈవో అశోక్ గతంలో ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయితే, సుధాకర్‌కు సహకరించారనే ఆరోపణలో ముగ్గురు ఉపాధ్యాయులు రవికుమార్(కంప్యూటర్ ఆపరేటర్), పార్వతి (హాస్టల్ కేర్‌టేకర్), రంజాన్‌బేగం (పీజీటీ హిందీ)కి షోకాజ్ నోటీసులు అందించామన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

మఠంపల్లి, జనవరి 30: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని శుభవార్త దేవాలయ విచారణ గురువు మార్టిన్ పసల, ఎస్‌ఐ సీహెచ్ బాలకృష్ణ అన్నారు. కానుకమాత దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం రాత్రి ప్రారంభించి మాట్లాడారు. దైద రాయల్ బ్రదర్స్ దేవపంగు ప్రసాద్ ఆధ్వర్యంలో కబడ్డీ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ దైద రాయల్, నిర్వాహకులు కొత్తపల్లి శౌరి, వస్కుల జయరాజు,పాల్గొన్నారు.

పీఏసీఎస్ అభివృద్ధికి రైతులు సహకరించాలి

నడిగూడెం, జనవరి 30: సహకార సంఘం అభివృద్ధికి రైతులు సహకరించాలని నడిగూడెం పీఏసీఎస్ చైర్మన్ పుట్ట రమేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని బృందావనపురంలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను రైతులు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవో ఎలమందరావు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నాగారం, జనవరి 30: బిక్కేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈటూరు శివారులో ట్రాక్టర్లను మంగళవారం పట్టుకుని సీజ్ చేసినట్లు ఏఎస్‌ఐ వెంకట్రాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఇసుకను తరలిస్తే ట్రాక్టర్ యజమానులపై కూడా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తా


అడ్లూరులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ రూరల్, జనవరి 30: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. మండలంలోని అడ్లూరు, గుడిబండ, రెడ్లకుంట, బీక్యాతండా, గణపారం, తొగర్రాయి గ్రామాల్లో కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజల ఇబ్బందులను తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య, జడ్పీటీసీ కృష్ణకుమారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో విజయశ్రీ, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

కుష్ఠు రహిత సమాజానికి కృషిచేయాలి


తిరుమలగిరిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, విద్యార్థులు

తిరుమలగిరి, హుజూర్‌నగర్ రూరల్, మఠంపల్లి, జనవరి 30: కుష్ఠు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని తిరుమలగిరి డాక్టర్ మల్లెల వందన, హుజూర్‌నగర్, మఠంపల్లి మండల వైద్యాధికారులు సన, సుధాకర్‌నాయక్ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా తిరుమలగిరి ప్రాథమిక పాఠశాలలో స్పర్శ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్ఠు రహిత సమాజం కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. అదే విధంగా కుష్ఠు వ్యాధిని నిర్మూలించాలని కోరుతూ హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు కార్యక్రమంలో సీహెచ్‌వో బిచ్చునాయక్, హెచ్‌ఎం అంజయ్య, రామచంద్రు, స్వరూప, ఇందిరాల రామకృష్ణ, నూర్జహాన్, పద్మ, శ్రీనివాస్, అలివేలుమంగ, స్వరూప, పెనుగొండ శ్రీను, నాగేంద్రమ్మ, మమత, సరిత, లోకేశ్వరి, భూదేవీ, రజిని, సైదమ్మ, చంద్రకళ, సీతమ్మ, రాధిక, సరిత పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి



జడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న సఖి కోఆర్డినేటర్ చైతన్య

తుంగతుర్తి, జనవరి 30: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సఖి కోఆర్డినేటర్ చైతన్య అన్నారు. సఖి కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ మేరకు విద్యార్థులకు లింగ వివక్ష, సమానత్వం, పిల్లల అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. వివిధ రకాల హెల్ప్ లైన్ నెంబర్లను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్, ఉపాధ్యాయులు సహదేవ్, కృష్ణవేణి, రవికుమార్, హరికృష్ణ, రాజన్న రాజు, సఖి సెంటర్ బాధ్యులు హేమలత, సుజాత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

పులీందర్‌రెడ్డి ఆశయాలు సాధించాలి: సీపీఎం


పులీందర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కోదాడ రూరల్, జనవరి 30: ప్రజా సేవకుడు జూలకంటి పులీందర్‌రెడ్డి ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో పులీందర్‌రెడ్డి 11వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మునగాల మండలం నర్సింహులగూడెం సర్పంచ్‌గా, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకుడిగా ప్రజాసమస్యల పరిష్కారం కోసం పులీందర్‌రెడ్డి కృషి చేశారని కొనియాడారు. పులీందర్‌రెడ్డిని కాంగ్రెస్ వర్గీయులు హత్య చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం టౌన్ కార్యదర్శి ఎం.ముత్యాలు, టౌన్ కమిటీ సభ్యుడు దాసరి శ్రీనివాస్, పార్టీ సభ్యులు తిరపయ్య, ఏసోబు, రాంబాబు, వెంకన్న, శ్రీను, సత్తిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఉపేందర్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చనున్న ఉత్తమ్

హుజూర్‌నగర్, జనవరి 30: పేదల సొంతింటి కలను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నెరవేర్చనున్నారని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాముల శివారెడ్డి, టీపీసీసీ సభ్యుడు దొంగరి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని ఇందిర సెంటరులో మోడల్ కాలనీకి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.74.80కోట్లు మంజూరు చేయగా, మంగళవారం ఆయన చిత్రపటానికి పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో కస్తాల శ్రావణ్, కోతి సంపత్‌రెడ్డి, గల్లా వెంకటేశ్వర్లు, షేక్ సైదా, అజీజ్‌పాషా, సుబ్బరాజు, యోనా, శ్రీనివాస్‌గౌడ్, దయాకర్, బంటు సైదులు, జేఎస్‌డీ, రామకృష్ణ, రాజా, రవి, సైదులునాయక్, విజయ్, బెంజిమెన్, పుల్లయ్య, వేణు, గురవయ్యగౌడ్, హుస్సేన్, రాము, మట్టయ్య, ముక్కంటి, నాగేశ్వరరావు, అంజిరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

గరిడేపల్లి: మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ సహకారంతో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని సర్పంచ్ మూలగుండ్ల విజయసీతారాంరెడ్డి అన్నారు. మండలంలోని కల్మలచెర్వు గ్రామ పంచాయతీ పరిధిలోని గంగానగర్‌లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నట్టి విజయ్, మాజీ జడ్పీటీసీ బచ్చలకూరి మట్టయ్య, మీసాల యోహాన్, వార్డు సభ్యులు ప్రేమ్, నాగేష్, నాయకులు బచ్చలకూరి కృష్ణప్రసాద్, గుండ్ల సత్యనారాయణరెడ్డి, ఆదిరెడ్డి, నట్టి జానకయ్య, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

10 మంది జూదరుల అరెస్టు

పాలకవీడు, గరిడేపల్లి, జనవరి 30: పాలకవీడు, గరిడేపల్లి మండలాల్లో పోలీసులు 10మంది జూదరులను మంగళవారం అరెస్టు చేశారు. పాలకవీడు ఎస్‌ఐ లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జాన్‌పహాడ్ దర్గా వద్ద పేకాట ఆడుతున్న నిజామాబాద్ జిల్లాకు చెందిని ఆరుగురిని అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి రూ.5,250లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు.

●గరిడేపల్లి మండలం ఖుతుబ్‌షాపురం గ్రామంలో పేకాట ఆడుతున్న నలు గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ పి.వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం,, మండలంలోని ఖుతుబ్‌షాపురం గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. మరో ఎనిమిది మంది పరారయ్యారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు, రూ2,030లు స్వాధీనం చేసుకున్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

తుంగతుర్తి, జనవరి 30: బాల్యమిత్రుడు ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబానికి స్నేహితులు ఆర్థికసాయం అందించి మానవత్వం చాటారు. మండలంలోని గొట్టిపర్తి గ్రామానికి చెందిన బోగోజు సురేష్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. ఆయనతో పాటు చదువుకున్న 1999-2000 బ్యాచ్ పదో తరగతి మిత్రులు మంగళవారం రూ.90వేలు ఆర్థికసాయం అందించారు. సురేష్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో స్నేహితులు ఆకుల శోక్, కిరణ్, ఉపేందర్, శ్రీను, రమేష్, బాలరాజు, సాయి, బ్రహ్మచారి, అన్నబోయిన యాకయ్య, సైదులు, రమేష్, సురేష్, రమేష్ పాల్గొన్నారు.



సూర్యాపేటఅర్బన్: జిల్లా అబివృద్ధే లక్ష్యంగా ప్రతి ఉద్యోగి పనిచేయాలని అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అన్నారు. కలెక్టరేట్‌లో ట్రెస్సా క్యాలండర్, డైరీలను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ట్రెస్సా అధ్యక్ష, కార్యదర్శులు కిషన్, అశోక్‌బాబు, సీపీవో వెంకటేశ్వర్లు, ఏడీ కిషన్, నరేందర్, కోటేశ్వర్‌రావు, బాలాజీ, లింగయ్య, రాజేష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.సీతారామయ్య కోరారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో రిటైర్డు ఉద్యోగులు సామూహిక పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సభ్యులు దండ శ్యాంసుందర్‌రెడ్డి, బి.రాంబాబు, ఎస్.హమీద్‌ఖాన్, లక్ష్మీకాంతరెడ్డి, సోమయ్య, రాములు, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సూర్యాపేట అర్బన్: భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కమిటీ పట్టణ నూతన కమిటీని జిల్లా కేంద్రంలోని ఓఫంక్షన్‌హాల్‌లో ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా కుర్రి నాగయ్య, ఉపాధ్యక్షుడిగా నాగవెల్లి కరుణాకర్, సూర్యాపేట మండల అధ్యక్షుడిగా కోనూరి సాయికుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఊదయ్య, గోగుల శేఖర్‌రెడ్డి, కొర్ర గోపీయాదవ్, కొండ సైదులు, జాటోతు భిక్షం తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట టౌన్: ప్రగతి నిరోధకంగా ఉన్న నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ కోరారు. ఫిబ్రవరి 3వ తేదీన నిర్వహించే ఛలో ఢిల్లీ కరపత్రాలను జిల్లా కేంద్రంలోని 60ఫీట్ల రోడ్డులో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంపత్, అఖిలాష్, విజయ్, రామ్ పాల్గొన్నారు.

● జిల్లా పరిధిలో నూతనంగా నియామకమైన నర్సింగ్ అధికారులు బుధవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియానికి రావాలని డీఎంహెచ్‌వో కోటాచలం ఒక ప్రకటనలో తెలిపారు. హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి 6:30 గంటకు, కోదాడ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఏడు గంటలకు, సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచి 7:30గంటలకు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. నర్సింగ్ అధికారులు ఐడీ కార్డులు, యూనిఫాంతో విధిగా రావాలని ఆయన కోరారు.

హుజూర్‌నగర్: మండలంలోని వేపలసింగారం గ్రామానికి కోదాడ ఎల్ఐసీ బ్రాంచ్ రెండు సోలార్ లైట్లను మంజూరు చేసింది. వేపలసింగారంలోని రామాలయం వద్ద, వైకుంఠ ద్వారం వద్ద వీటిని ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చక్కెర వీరారెడ్డి, ఎంపీటీసీ గోపిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో దొండపాటి శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి, వసంతరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: ఇళ్లు లేని పేదలకు రుణ సదుపాయం కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్ కోరారు. పలు సమస్యలపై డిప్యూటీ తహసీల్దార్ సుధారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతింటి కసం ఎంతోమంది పేదలు ఎదురుచూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో దుగ్గి బ్రహ్మం, గోపరాజు, వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, వీరస్వామి, వీరయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: మండలంలోని బూరుగడ్డ గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంలో క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీనాథ్, విశ్వనాథ్, సైదారామ్, నగేష్, సైదులు పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో నృసింహుని నిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: మంచినీటి అవసరాల కోసం సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసిన ప్రభుత్వం ఆ నీటితో చెరువులు, కుంటలు, బావులను నింపాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కవితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి, నాయకులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, కడియాల అప్పయ్య పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో పశువైద్య, పశుసంవర్థక శాఖ, మైహోం సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో బుధవారం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి ఉష ఒక ప్రకటనలో కోరారు. ఈ శిబిరంలో పశువులు, కోళ్లు, ఇతర పెంపుడు జంతువులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తామన్నారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల సబ్ పోస్టాఫీసు కార్యాలయంలో ఆధార్ సేవలు ప్రారంభిస్తున్నట్లు పోస్టాఫీసు మేనేజర్ వీరారెడ్డి తెలిపారు.

మోతె: గ్రామీణ ఫోటోగ్రాఫర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఫొటోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని మామిళ్లగూడెంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫొటోగ్రఫీలో రాణిస్తున్న సిరికొండ గ్రామానికి చెందిన కాంపాటి నందకిశోర్‌ను, నూతన కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కూకుట్ల లాలయ్య, హనుమంతరావు, చారి, ప్రభంజన్, సంజీవ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోతె: ఎడమ చంద్రారెడ్డి ఆశయాలను నేటి తరం యువత కొనసాగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మట్టిపెళ్లి సైదులు అన్నారు. చంద్రారెడ్డి 34వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన స్మారక స్థూపం ఎదుట నివాళులర్పించి మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలకు ఎదురొడ్డి పోరాడిన మహోన్నతుడు చంద్రారెడ్డి అని ఆయన కొనియాడారు. చంద్రారెడ్డిఆశయాలను నేటి తరం నాయకులు, యువత కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో జంపాల స్వరాజ్యం, గోపాల్‌రెడ్డి, యేసు, పోతయ్య పద్మ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు: కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పోజు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన కౌలు రైతుల సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. హన్మకొండలో ఈ నెల 31న జరిగే కౌలు రైతుల సంఘం రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరారు. అనంతరం రైతు సంఘం డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతులు కొండా వెంకయ్య, పిల్లుట్ల కనకారావు, బాలెబోయిన సైదులు, రాములు, ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, బెల్లంకొండ రాధాకృష్ణ పాల్గొన్నారు.

మునగాల రూరల్: మండలంలోని విజయరాఘవపురం సీనియర్ సిటిజన్ అసోసియేషన్ గ్రామ కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుంకరి సైదయ్య, ఉపాధ్యక్షుడిగా గుండు నర్సయ్య, కార్యదర్శిగా దొంగరి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా దొంగరి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుంకరి పిచ్చయ్య, కోశాధికారిగా మొగిలిచర్ల రామయ్య, కార్యవర్గ సభ్యులుగా సుంకరి రామస్వామి, గన్నా వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆరె.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.